# వర్షించిన మేఘాలు



వేగంగా పరుగులు తీస్తున్న రైలు వేగం కాస్త తగ్గింది. ఏవో ఆలోచనలతో కొట్టుకులాడుతున్న రామారావు తల తిప్పి కిటికీలో నుండి చూశాడు. అంతవరకూ పరుగిడుతున్నట్లున్న

వాచస్పతి

చెట్లన్నీ రైలువేగం తగ్గగానే, ఆగి ముందుకు సాగిపోతున్న రైలుబండికి స్వాగతం ఇస్తున్నట్లున్నాయి. పచ్చని చెట్లవెనక ఉన్న ఎత్తయిన కొండలూ, కొండల చాటున అస్తమిస్తూన్న సూర్యుడూ అందాలను చిమ్ముతున్నాయి. అస్తమిస్తున్న సూర్యుని అరుణిమ ఆకాశమంతా అలుముకుని ఆకాశ కాంతకు సరిక్రొత్త రామణీయతను చేకూర్చి పెడుతూంది. ఆ ప్రకృతిసౌంద ర్యాన్ని ఆస్వాదించే స్థితిలో లేని రామా రావు బరువుగా చూపులు త్రిప్పి భారంగా నిట్టూర్చాడు. చెయ్యి తన ప్రమేయం లేకుండానే జేబులోకి వెళ్ళింది. తెల్లని కాగితం మీద ముత్యాల్లా ఉన్న అక్షరాలను కళ్ళు త్వరత్వరగా చదివాయి. అప్పటికే అనేక మార్లు చదివిన ఆ ఉత్తరంలోని విషయం మొదట ఎప్పుడో కంఠస్థం చేసింది. అయినా, ఐదు నిముషాల కోమారు జేబులోని ఉత్తరం తీసి చదవకుండా ఉండలేక పోతున్నాడు. ఉత్తరం మడత విప్పాడు.

శ్రీ వారికి,

బాబుకు నాలుగురోజులుగా బాగుండడము లేదు. వర్షాకాలం రావడంవల్ల వాడిని పట్టి పీడిస్తున్న వ్యాధి తీవ్ర రూపం దాల్చింది. ఇది ఏ విషాద పరిణామాలకు దారి తీస్తుందో చెప్పడం కష్టం. తెలియజేయవలసిన బాధ్యత నామీద ఉంది గనక వ్రాస్తున్నాను.

ఇట్లు
మీ సరోజ"

ఉత్తరంలో నుండి తలెత్తి కన్నీటి పొరగుండా దూరంగా చూశాడు. హృదయం వేయి శూలాలతో పొడిచినట్లు మెలికలు తిరిగిపోసాగింది.

ముఖంలో బాధావీచికలు కదిలాయి. ఉత్తరాన్ని మడచి జేబులో పెట్టుకున్నాడు.

రైలు మరీ నెమ్మదిగా పోతూంది. రైలుమీదా, రైలు నడుపుతున్న డ్రైవరు మీదా విపరీతమైన కోప మొచ్చింది. రామారావుకు,

స్టేష నింకా రెండు ఫర్లాంగుల దూరం ఉండగానే బ్యాగ్ తీసుకుని నిల్చున్నాడు,

దిగవలసిన స్టేషన్ చివరకు రానే వచ్చింది. తడబడుతున్న అడుగులతో రైలు దిగాడు, రిక్షాచేసుకుని బయలుదేరాడు.

రిక్షా దిగి వరండాలోకి వచ్చేసరికి హృదయం మరీ కృంగిపోయింది.

మన సెందుకనో అశుభాన్నే సూచించసాగింది. ఒణకుతున్న చేత్తో మెల్లగా తలుపుమీద తట్టాడు,

కొన్ని క్షణాలు జరిగిపోయినా ఎలాంటి జవాబూ రాలేదు.

నిశ్శబ్దంగా ఉన్న ఆ ఇల్లు అతని గుండెలను దడదడ లాడించేసింది.

తిరిగి మెల్లగా తలుపు తట్టాడు. కొన్ని క్షణాల తర్వాత తలుపు కొద్దిగా తెరచుకుంది.

ఆ తలుపు సందులోనుండి ఐదేళ్ళ సతీష్ విచిత్రంగా రామారావువేపు చూశాడు.

సతీష్‌ను చూడగానే రామారావు కన్నుల్లో నీళ్ళు సుడులుతిరిగాయి. హృదయంలో పితృప్రేమ పొంగి పొరలింది.

''రా, బాబూ!'' అంటూ, లోపలకు అడుగువేస్తూ, చేతులు చాపాడు.

సతీష్ ఒక్క పరుగులో వెళ్ళి హాలు మూల నక్కి బిక్కుబిక్కు మంటూ తండ్రివేపు చూడసాగాడు.

దాంతో రామారావు హృదయం విలవిల లాడిపోయింది.

జీవితం ఆక్షణంలోనే పడి సమాప్తి చెందినా బాధపడవలసిన అవసరం లేదనిపించింది.

తన ఆత్మకు ప్రతిబింబమైన తన కొడుకు, తననుండి అలా పారిపోవడం, ఎవరినో అపరిచిత వ్యక్తిని చూసినట్లు భయంగా, చిత్రంగా చూడడం — అంత కంటె వేరేశిక్ష మరొకటి లేదనిపించింది. వ్యధిత హృదయంతో హాలు నలుమూలలా పరికించి చూశాడు.

సంవత్సరమన్నా నిండని బాబు కళ్ళు మూసుకుని మంచంమీద పడి ఉన్నాడు. ఊపిరి బరువుగా పీలుస్తున్నాడు. మంచం ప్రక్కగా క్రింద పనిమనిషి కూర్చొనుంది.

ఏదో అడగాలనుకుని నోరు తెరచిన వాడు ఏమీ అడగకుండానే మౌనంగా మంచంవేపు నడచి, మంచం పట్టెమీద కూర్చుని బాబు ముఖంలోకి చూడ సాగాడు.

ముఖంలో రకరకాల భావాలు కదులు తున్నాయి. కాసేపటికి — ''ఆమేదీ?'' అన్నాడు విచలితస్వరంతో.

''డాక్టర్ను తీసుకరాను వెళ్ళారు. ఈరోజు బాబుకు మరీ ఎక్కువయింది.'' సతీష్‌వేపూ, రామారావువేపూ మార్చి మార్చి చూస్తూ అంది.


''పాప?''

''ఏడుస్తుంటే, అమ్మ కూడా తీసుక వెళ్ళారు.'' బరువుగా నిట్టూర్చి, తిరిగి బాబు ముఖంలోకి చూస్తూ కూర్చున్నాడు రామారావు.

అవ్యక్తమైన వేదనేదో హృదయాన్ని కాల్చివేయసాగింది.

మెదడు గతంలోని సుఖదుఃఖాలను పునరావృత్తి చేస్తూ ముందుకుసాగింది. సరోజను ప్రేమించి పెళ్ళి చేసుకున్నా డని తను చెప్పలేడుగానీ, ఇష్టపడి చేసు కున్నదిమటుకు వాస్తవం.

తెల్లగా, పొడుగ్గా, కోలముఖంతో,




చలాకీతనమంతా తనే గుత్తకు తీసుకున్నట్లున్న సరోజ ఎవరినైనా ఇట్టే ఆకర్షించడంలో అసహజ మేమీలేదు.

ప్రధమవీక్షణలో తననూ ఆకర్షించి ఆకట్టుకుంది.

సరోజనే చేసుకుని తీరాలన్న నిర్ణయము తనేమీ చేసుకోకున్నా, ఇంట్లో వాళ్ళ అభిప్రాయం ఎలా ఉందో తెలుసుకోవడం మంచిదని, మాటల సందర్భములో, అమ్మతో పరోక్షంగా ఆ ప్రస్తావన తెచ్చాడు, అమ్మా తనూ ఒంటరిగా ఉన్నప్పుడు.

ఏదో కూర తరుగుతున్న అమ్మ కనుకొనకుల్లోనుండి తనవేపు ఒక క్షణం చూసి తిరిగి తన పనిలో మునిగిపోయింది.

ఆశా నిరాశల మధ్య కొట్టుకులాడుతున్న తను అమ్మ ముఖంలోని భావాల కదలికను పరిశీలిస్తూ గడప మీద కూర్చున్నాడు,

కొన్ని క్షణాల తర్వాత అమ్మ తన వేపు తిరిగి చిరునవ్వుతో "మన కులమేనా ?" అంది.

తను అవునన్నట్లు తలూపాడు,

"మరిక అభ్యంతర మేముంది, నీ కిష్టమయినప్పుడు ?" తన ముఖంలోకి చూస్తూ ప్రశ్నించింది.

తనేం జవాబు చెప్పలేదు.

నేల చూపులు చూస్తూ మౌనంగా ఉండిపోయాడు.

అమ్మ సాభిప్రాయంగా, మెత్తగా నవ్వుతూ "ఏమిటో చెప్పు ?" అంది.

"కట్నం..." నేల చూపులు చూస్తూ మెల్లగా గొణిగాడు.

"అంటే" అంది నవ్వుతూ.

తను తలెత్తి అమ్మ కళ్ళల్లోకి చూశాడు, "అంటే, ఇంట్లో మీరంతా నాకు కట్టిన వెల వాళ్ళ కందుబాటులో ఉండదేమో?" లేని కఠినత్వాన్ని తెచ్చుకుని అన్నాడు.

అమ్మ అదోరకంగా నవ్వింది. బహుశా తను సరోజ విషయంగా అన్ని వివరాలు సేకరించినందుకేమో?

ఆ ఆలోచన రాగానే చప్పున తల దించుకున్నాడు. సిగ్గువల్ల అమ్మ ముఖం లోకి చూడలేక పోయాడు,

తన డిగ్రీ, ఉద్యోగపు హోదా, అందమూ వీటన్నిటినీ చూసి అంత వరకూ మురిసిపోతున్నా, ఆ క్షణంలో మటుకు అవే సరోజను తనకు కాకుండా చేస్తాయేమో అన్న భయం కలగక పోలేదు.

"కట్నం దేముంది? అమ్మాయి సలక్షణంగా ఉంటే?"

అమ్మనోట ఆ మాట వినగానే తన హృదయం పురి విప్పిన నెమలిలా నాట్యం చేసింది,

తన కన్నుల్లో, ముఖంలో వెలిగి పోతున్న సంతోషరేఖలను అమ్మ చూస్తుందని తెలిసినా దాచేందుకు ప్రయత్నించలేదు.

తలెత్తి అమ్మవేపు చూచాడు.

సరోజ రూపగుణ వర్ణన చేయాలని తహతహ లాడుతున్న హృదయాన్ని అతి ప్రయత్నం మీద అణచిపెట్టి– "నాన్న ఇష్టపడతారా?" అన్నాడు పైకి అమ్మ సుముఖంగానే ఉంది గనుక, సరోజను చేసుకోవాలని మనసులోనే తీర్మానించుకుంటూ.

"ఎందు కిష్టపడరు? పది వేలు ఎక్కువ వస్తాయని నీ కిష్టంలేని పెళ్ళి చేస్తామా? నీ కెందుకు? మీ నాన్నతో నేను చెప్తానుగా!" కూరముక్కలన్నీ గిన్నెలో వేసుకుని లేస్తూ, అనునయ కంఠంతో అంది.

తను మనసులోనే శతకోటి జోహారు లర్పించాడు అమ్మకు.


అమ్మ ముందుతరానికి చెందిన దయినా ఈతరం వాళ్ళను చక్కగా అర్థం చేసుకోగలదు.

సనాతన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిపెరిగినా, భర్త గృహంలో అనుస రించే అధునాతన పద్ధతుల నన్నింటినీ ఎలాంటి మానసిక సంఘర్షణా లేక అనుసరించకలిగింది.

ఉన్నతవిద్యవలనా, విదేశయాత్రల వలనా ఎంతో ఉన్నత దృక్పథం ఏర్పడిన నాన్ననుగూడా మించిపోయేది అమ్మ ఒక్కోసారి.

నాన్న ఎన్నోసార్లు ఆవిషయం ప్రస్తావించి, ప్రశంసించేవారు.

పుట్టుకతోనే ఆమెకు లభించిన



అలాంటి తల్లిని పొందినందుకు తను నిజంగా అదృష్టవంతుడు.

సరోజ తమ గృహంలో అడుగు పెట్టి కోటి ప్రభల కాంతులను వెద జల్లింది. తన హృదయాన్ని శతసహస్ర వసంతశోభలతో నింపింది.

ఆ కోడలిని చూసుకుని అమ్మ ఎంత మురిసిపోయేదో!

సంస్కార పరిమళాలు తమ గృహాన్ని మధురమైన సువాసనలతో నింపాయి.

ఎలాంటి సంఘర్షణలూ, అపార్థాలూ లేక తమగృహం శాంతి విలాసమే అయింది.

తమ జీవితాలు సుఖ సంతోషాలతో వెల్లి విరిసాయి.

కానీ, సరోజను కోడలుగా చేసుకోటాని కమ్మ అంత సులభంగా ఒప్పుకుంటుందని తను అనుకోలేదు.

''ఇంటికి దీపంరా, సరోజ'' అనేది రోజు కో సారయినా.

"అవునవును! దీపమే! ఇకమనం కరెంటుబిల్లు కట్టనవసరంలేదు!'' అనేవాడు సరోజ కన్నుల్లోకి ఓరగా చూస్తూ.

సరోజ గర్వంగా చూసేది తన కన్నుల్లోకి.

తనూ సరోజా ఎక్కడికన్నా బయలుదేరితేసరి, డాక్టర్ చదువుతున్న తమ్ముడు, వేణు హాస్యమాడేవాడు –

''వొదినా, అన్నయ్య నిన్ను షికారుకూ, సినిమాలకూ తీసికెళ్తున్నాడంటే, ఎందు కనుకున్నావేంటి ? తన భార్య ఎంతో అందమైనదని నలుగురికీ తెలియజేసేం దుకే !'' అని అంటే తను చురచురా వాడిముఖంలోకి చూడడం తప్ప మరేం అనేవాడు కాదు.

వొదినా, మరదీ ఇద్దరూ కలిసి ఫక్కున నవ్వి తనను గేలిచేసేవారు, అమ్మ మటుకు తనను వెనకవేసుక వచ్చేది.

"రేపు నువ్వుమటుకు వెంటపెట్టుక పోవేంటి ? అదీ చూస్తాంగా ?" అనేది నవ్వుతూ,

''ఒదిన అంతటి అందమయిన పిల్లను నాకు తెచ్చిచేస్తే ఎందుకు వెంట పెట్టుకపోను ?'' అంటూ ఎదురు ప్రశ్న వేశేవాడు.

'''ఆ పని మీ వదినకే అప్పజెప్పు బాబూ, నాకు తెలీదు,'' అనేది అమ్మ,

వేణు సీరియస్‌గా ముఖం పెట్టి. "నువ్వొట్టి పిచ్చిదానవమ్మా ! అంద ములో తనతో పోటీపడే పిల్లను తెచ్చి వదిన ఈ ఇంట్లో పెడుతుందా ?'' అనే వాడు.

సరోజ కిలకిలా నవ్వుతూ ''అవును, అదీ నిజమే వేణూ ! ఆ త్రిలోకసుంద రిని నువ్వే వెతుక్కో. ఒకరికి శ్రమ ఇవ్వడ మెందుకు ?" అనేది.

వేణు వస్తున్న నవ్వును బిగబట్టి ''అదెప్పుడో జరిగిపోయింది ఒదినా !'' అనేవాడు.

దాంతో అందరూ పక్కున నవ్వే వాడు. అలాంటి సంభాషణ తరచూ జరుగుతూండేది.

అంత సరదాగా, సంతోషంగా గడచిపోయిన రోజులు ఇక జీవితంలో ఎన్నటికీ రావేమో ?

తన హృదయోద్యానాన్ని వసంత శోభలతో నింపిన సరోజ మరు సంవ త్సరం తన జీవితానికే చంద్రోదయం లాంటి సతీష్ నిచ్చింది.

మరుసటి సంవత్సరం తనకు బెంగళూరు ట్రాన్స్‌ఫర్ అయింది. తను బెంగుళూరు వచ్చిన నెలకేమో అమ్మ గుండెపోటుతో చనిపోయింది.

ఆమె లేని వెలితి ఇంటిలోని ప్రతి వస్తువూ చెప్తుంది.

కానీ, ఈ రోజు అమ్మే ఉంటే ...

సరోజ నిలా ఒంటరిగా ఉండనిచ్చేదా? ఆ భావనతో కన్నుల్లో నీళ్ళు తిరిగాయి; బాబు పెద్దగా మూల్గాడు.

కన్నీటి పొరగుండా వానివేపు చూశాడు. ఊపిరి తీసుకోను వాడు పడే అవస్థ చూస్తుంటే, రామారావు హృదయం ద్రవీభవించింది. సరోజ రాకకోసం ఆత్రంగా ఎదురుచూస్తున్న హృదయానికి ప్రతిక్షణం నిరాశే ఎదురయింది.

''ఈమె ఇంకా రాలేదే ? ఎంతసే

పయింది వెళ్ళి ?'' పనిమనిషి వేపు తిరిగి అడిగాడు.

''అర్ధగంట అయిఉంటుంది బాబూ! ఈపాటికి వొస్తూ ఉంటారేమో ?''

అతను మరేం అడగలేదు. మౌనంగా ఉండిపోయాడు.

మరో నిముషానికల్లా వాకిట్లో రిక్షాలు ఆగిన చప్పు డయింది.

ముందు డాక్టరూ, వెనక మూడేళ్ళ పాప నెత్తుకుని సరోజా లోపలికి వచ్చారు.

రామారావును చూడగానే సరోజ ముఖంలో ఆశ్చర్యం, ఆనందం, ఆవేదనా అన్నీ కలగాపులగంగా అలుముకున్నాయి.

విషాదకరమైన స్మృతులు మనసును అల్లకల్లోలం చేశాయి.

శరీరంలోని శక్తంతా మాయమై పోయినట్లు అడుగు తీసి ముందుకు పెట్ట లేకపోయింది. కొన్ని క్షణాలకు తనను తాను సంబాళించుకుని పాపను క్రిందకు దించి, డాక్టరుకు కావలసిన వస్తువులు అందించేందుకు ముందుకు అడుగు వేసింది.

డాక్టరు బాబును పరీక్షించి, ఇన్ జెక్షన్ ఇచ్చి, బాబు ముఖంలోని మార్పును పరిశీలిస్తూ కూర్చున్నాడు.

''డాక్టర్...బాబుస్థితి...''

సరోజ గొంతు వొణికింది.

''మరేం భయపడకండి; ఇంకా అర్ధ గంట చూసి, అవసరమైతే మరో ఇన్ జెక్షన్ ఇచ్చివెళ్తాను,'' అన్నాడు నిశ్చల కంఠంతో.

సతీష్, పాపా ఏదో వస్తువుకోసం పోట్లాట ప్రారంభించారు.

పాప ఏడుపు ప్రారంభించింది.

పనిమనిషి ఇద్దరినీ తీసుకుని వీధి లోకి వెళ్ళింది.

సరోజను పలకరించా లనుకున్న రామారావు డాక్టరుముందు ఎలాంటి పరాభవాన్ని పొందవలసివస్తుందో నన్న భయంతో, ఆ ప్రయత్నం విరమించుకుని. నిశ్శబ్దంగా సరోజ ముఖంలోకి చూడ సాగాడు. సరోజ గోడనానుకుని నిల్చుంది.

అప్రయత్నంగానే భర్త చూపులతో చూపులు కలిసాయి.

దీనత్వానికి ప్రతిరూపంలా కూర్చొనున్న అతని రూపం, ఆమె ఎదను కదల్చివేసింది. ఈ ఆరు నెలల్లోనే ఎంతగా మారిపోయాడ్. పీల్చుకపోయిన ముఖం, లోతుకు పోయిన కళ్లూ, బక్కచిక్కిన శరీరం.

ఆనాటి వారి రూపం కాదిది. ఆ ఆలోచనలతో హృదయంలో చెయ్యి పెట్టి దేవినట్లయింది.

ముందే భారమయిన మెదడు మరీ బరువుగా తయారయింది.

గజిబిజిగా వున్న అన్ని ఆలోచనల గుండా దారి చేసుకుని, అతి బాధాకరమూ, విషాదకరమూ అయిన గతం తాలూకు ఆలోచనలు ముందుకు సాగాయి.

అన్యోన్య దాంపత్యానికీ, ఆదర్శ జీవితానికీ తమ గృహం ఆసరం – ఒకప్పుడు.

'సరోజా, రామం' అనే పేర్లకన్నా 'సీతారాము లంటే ఎంతో బాగుండేది' అని ఎన్నో సార్లంది అత్తయ్య – తమ దాంపత్య జీవితాన్ని చూసి మురిసిపోతూ.

ఆ మాట అత్తయ్య అన్నప్పుడల్లా తన హృదయం ఆనందంతో, గర్వంతో ఉప్పొంగిపోయేది. తమ అనురాగలత చిగిర్చి పుష్పించింది.

మొదట మనోజ్ఞ మధుర కుసుమమే సతీష్.

తనతోపాటు ఎంతో సంతోషాన్నీ సంతృప్తినీ, జీవితాని కో అర్ధాన్నికూడా తెచ్చాడు వాడు.

హృదయాన్ని హరించి వేయగల వాని చూపులూ, మానసోల్లాస కరమైన వాని జిలిబిలి పలుకులూ, పడుతూ లేస్తూ నడిచేందుకు వాడు చేసే ప్రయత్నాలూ, తనకు ఎక్కడలేని గర్వాన్నీ చేకూర్చి పెట్టేవి.

తన మాతృత్వం సార్థకమైన ట్లని పించింది. ఇక వారి ఆదరణ సరేసరి –

చూపులే దీపాలుగా చేసి, వెలిగించి, అనురాగ సుమమాలలతో అలంకరించి, ప్రేమసుధా ధారలతో అభిషేకించి, ఆరాధన చేసినప్పుడు తన కెక్కడలేని శోభా కలిగేది.

తన స్త్రీత్వం చరితార్థమైన ట్లని పించేది. తన సంసారంకంటే ఆనంద కరమైన సంసారాలు ఉంటాయా ? దీనిని మించిన స్వర్గం వేరే ఒకటుందా ? అని అనుకుని మురిసి పోయిన రోజులు జీవితంలో లెక్కలేనన్ని !

ఎంత అహంభావం !

కానీ, భవిష్యత్తు తనకోసం నరకం లాంటి జీవితాన్ని చవిచూపేందుకు అతి విషాదకరమైన సంఘటనల నెన్నింటినో భద్రంగా దాచిపెట్టిఉందని ఒక్కసారిగూడా ఊహించలేకపోయింది.

కనీసం కలలోగూడా అనుకోలేదు.

అవును ఎలా అనుకుంటుంది ?

తనేకాదు, ఎవరుమటుకు ఎలా అనుకోగలరు ? విశాల వినీల వినిర్మలాకాశమే పడవ కాగా, ధవళ శుభ్ర జ్యోత్స్నకా కాంతులలో విహరిస్తున్న నెలరాజుకు అకాల కారుమేఘాలు వచ్చి తన మధుర విహారయాత్రను నాశనం చేస్తాయని ఎలా తెలుస్తుంది ?

పాప ఏ దుర్ముహూర్తాన పుట్టిందో ఏమో, స్వర్గంలాంటి తన సంసార జీవితం తారుమా రయింది.

దానికి పాపే కారణమని పాపను నిర్లక్ష్యం చేసిన రోజులూ ఎన్నో ఉన్నాయి.

పాపమీద ఏర్పడిన ఉదాసీనత చివరకు పాప ప్రాణాలనే బలిగా తీసుకోబోయింది ఒకసారి.

మాతృప్రేమతో పొంగి పొరలవల



సిన తన హృదయంలో అంత కఠినత్వానికి ఆ తావెక్కడిదో ఈ రోజుకూ తనకర్థంకాదు. మానవ మనస్తత్వాలు నిజంగా చిత్రమైనది; అకారణమైన కోపమూ, ద్వేషమూ కన్నబిడ్డలమీద గూడా ఏర్పడతా యనడం ఎంత ఆశ్చర్యకరం!

తన అదృష్ట దురదృష్టాలకు పాప కారణ మెలా అవుతుంది ?

కానీ, అది చాలా ఆలస్యంగా తెలుసుకున్న విషయం.

ఏ ఒడుగుదుడుగులూ లేక పూలబాటలో సాగిపోతున్న తన సంసార శకటం కఠిన కంటక మయమైన అడ్డదారిని ప్రవేశించింది. బెంగుళూరు రావడంతో వారు మారిపోయారు.

క్లబ్బే సర్వస్వమూ అయింది.

ఏనాడూ లేనిది జూదం ప్రారంభిం

చారు. ఉదయ మసంగా ఆఫీసుకు వెళ్తే తిరిగి ఏ పదింటికో, పన్నెండుకో – తన కెప్పుడు బుద్ధిపుడితే అప్పుడు రావటం.

కళ్ళల్లో ఒత్తులు వేసుకుని వేచివున్న తనకు లభించే బహుమతి పరుష వచనాలూ, చీత్కారాలూ.

'ఇంత రాత్రివరకూ మేలుకుంటే ఎలాగ ? ఆరోగ్యం చెడిపోదూ ?' అని మృదువుగా అడిగితే – 'నిన్నెవరు కాచుకు నుండమన్నారు ? నిద్ర పోకూడదూ ?' అన్న కఠినాతికఠినమైన సమాధానం ! దాంతో అసలే బాధతో వీగిపోతున్న తన హృదయం చిల్లులు పడిపోయేది.

అన్నం ముందు కూర్చుంటే అన్నం చల్లగా ఉందనో, కూరలు చప్పగా ఉన్నాయనో కూర్చున్న మరుక్షణమే లేచిపోవడం; ఇక తనుమటుకు ఎలా తినగలదు? ముద్ద నోటి కెలా పోతుంది? ఆ కఠినత్వమూ, నిర్లక్ష్యమూ చాలు – వేరే రంపపు కోత అవసరం లేదని పించేది.

గత జీవితంలోని మాధుర్యాన్ని, వారి ప్రేమాదరణలను పదేపదే గుర్తు చేసుకుని చేదులాంటి వర్తమానాన్ని కొద్దిగానన్నా తియ్యగా చేసుకోవాలని ప్రయత్నించేది !

ఎంత పిచ్చితనం !

గృహ యజమాని మారడంతో గృహంలోని ప్రతి విషయం మారి పోయింది.

ఒక్కొక్క నెల జరిగేకొద్దీ ఇంటి ఖర్చు కిచ్చే డబ్బుగూడా తగ్గుతూ వచ్చింది. ఐదువందలు వస్తుందని పేరే గాని, ఇంటి అద్దె నూటపాతిక పోగా పాతికో పరకో తనచేతిలో పెట్టేవారు. మిగతా డబ్బంతా పేకాటక్రిందే తగలేసేవారు.

చివరినెలల్లో ఇంటి అద్దెకూడా ఇచ్చే వారు కాదు.

ఇల్లుగల సేఠ్‌జీకి సమాధానం చెప్ప లేకపోయేది తను.

అతనిముందుకు వెళ్ళి 'ఈ నెలలో ఇబ్బంది అయింది. వొచ్చే నెలలో ఇస్తా'మని చెప్పేందుకు ప్రాణం చచ్చి పోయేది. కరువులో అధికమాసంలా– అప్పుడే బాబుకూడా పుట్టాడు.

ఒంటిమీద ఉన్న బంగారమంతా కొద్ది కొద్దిగా ఇంటిఖర్చుకు హరించుకు పోయింది.

రెండు సంవత్సరాలు ఎలాగో సం సారాన్ని సర్దింది; అన్ని అవమానా లనూ, బాధలనూ ఓర్చుకుంది.

ఇక తనవల్ల కాలేదు.

రోజు గడపడమే కష్టమైపోయింది. ఎంతో సుఖంగా బ్రతకవలసిన తన పిల్లలు దారిద్ర్యదేవత ఇనుప పాదాల క్రింద నలిగిపోవటం తను చూడలేక పోయేది.

తనకోసం కాకున్నా, వాళ్ళకోస మన్నా ఏదో ఒకమార్గం చూడాలి.

ఆకలి మరణానికి తన పిల్లలు బలి కాకూడదు.

కానీ, మార్గం ?

మావయ్యకు డబ్బుకోసం వ్రాస్తే ఆయన విషయం తెలుసుకుని బాధపడ తారు. వృద్ధాప్యంలో ఆయనకు మన స్తాపాన్ని కలిగించడం తన కిష్టం లేక పోయింది. అయినా, ఒక నెలా, రెండు నెలలా ?

ఒకసారి సహాయం చేస్తే అంతటితో తీరేదేనా ?

ఎల్లకాలం ఎవరు సాయం చేయ గలరు ? అందుకనే తను ఎవ్వరినీ సహాయం కోరలేదు.

ఏనాటికన్నా వారు తన తప్పును తెలుసుకోలేకపోతారా ?

వారిని పట్టి పీడిస్తున్న దుష్టశక్తి ఈ రోజు కాకుంటే, రేపయినా వదలిపోదా?–

అన్న ఆ భావమే, అన్ని బాధలనూ సహించగలిగే శక్తి నిచ్చింది.

వర్తమానం నరకంలా ఉన్నా, భవి ష్యత్తు స్వర్గాన్ని తెస్తుందన్న ఆశ మాన వుని నరనరంలో జీర్ణించి పోబట్టి గాబోలు, కష్టాలకడలిలో తేలిపోతూన్నా, ధైర్యంగా ఉండగలుగు తూన్నాడు మానవుడు !

లేకుంటే మనిషి అసలు జీవించ గలడా? వారు తన కోసంసార ముందన్న విషయమే మరచిపోయారు.

అలాంటప్పుడు ఆ సంసారాన్ని పోషించవలసిన బాధ్యత తనదేనన్న విషయంమటుకు ఎలా గుర్తుంటుంది ?

వారు కర్తవ్యపథాన్ని దాటివెళ్ళారు. పథ విహీనులైనవారిని తిరిగి ఆ మార్గం లోకి తీసుక వచ్చేందుకు, తను శక్తి వంచన లేకుండా పోరాడింది. లాభం – లేకపోయింది. వారు విస్మ రించిన బాధ్యతలను తను స్వీకరించ కుంటే, తన పిల్లలు తనకు దక్కరేమో అన్న భయాందోళనలే తన నీ దూర ప్రాంతాలకు తీసుకవచ్చాయి.

ముసుగులో గుద్దులాట ఎన్నాళ్ళని ?

అటో ఇటో తేల్చుకోవాలన్న తీర్మా నానికి రాక తప్పలేదు,

ఆ రోజు... తలచుకుంటేనే గుం డెలు వ్రయ్యలౌతాయి... ఆయన రాక కోసం కాచుక కూర్చుంది.

ఆ రోజు జీవితంలో మరచిపోలేని రోజు– అవును. ఎలా మరచిపోగలదు?

రాత్రి రెండు గంటలకు కాబోలు ఇంటి కొచ్చారు.

భోజనానికి రమ్మని పిలువలేదు. ఏమన్నా ఉంటేగా పిలిచేందుకు ?

ఆయనా ఆ ప్రస్తావన తీసుకరాలేదు. మౌనంగా వెళ్ళి పడుకున్నారు. తనూ వెంట వెళ్ళింది.

కళ్ళు మూసుకుని పడుకునున్నారు. ముఖంలో అలసటా, బాధా.

అప్రియమైన విషయాన్ని గురించి ప్రస్తావించి, వారిని బాధించడం ఇష్టం లేకపోయింది. కానీ, తప్పదు.

జీవితంలో, ఇష్టం లేకపోయినా, కొన్ని పనులను పరిస్థితుల ఒత్తిడివల్ల చేయవలసివస్తుంది.

'చూడండి' సాధ్యమైనంత వరకూ కంఠాన్ని మృదువుగా మార్చి పిలిచింది. కళ్ళెత్తి కోపంగా తనవేపు చూశారు.

'చివరిసారిగా మిమ్ములను ప్రార్థిస్తున్నాను. బాధ్యతలకు దూరంగా వెళ్ళి ఇలా ప్రవర్తించడం న్యాయమేమో ఒక్కసారి ఆలోచించండి?' అంది.

'హుఁ...ప్రారంభించావా హితోపదేశం! లేచివెళ్ళు;' గోడవేపు తిరిగి పడుకుంటూ కఠినంగా అన్నారు.

ఆ కఠినత్వానికి అలవాటుపడినా, కన్నుల్లో నీళ్ళు చివ్వున తిరిగాయి.

ఒకనిముషం ఏం మాట్లాడటానికీ చేతగాక మౌనంగా నిల్చుంది.

'మీకు హితోపదేశంలాగే కనిపించవచ్చు. పోనీ, అలాగే అనుకోండి. బాధ్యతలను మరచిపోయిన మీకు వాటిని గుర్తుచేయడం నా కర్తవ్యం. నాకోసమే అయితే, ఇంత ప్రాకులాట అనవసరం. పిల్లలకోసం...?' చివరిమాటలు అనేటప్పుడు గొంతు వొణికింది.

'మాట మాట్లాడ్తే పిల్లలు పిల్లలు! ఏం చెయ్యమంటావు, పిల్లలకోసం? ఉరెట్టుకుని చావమంటావా?'' విసురుగా తల తనవేపు త్రిప్పి, అన్నారు.

కోపంతో మనిషి నిలువెల్లా ఊగిపోసాగారు. వారలా అనడంతో, విసిగిపోయిన తన హృదయం, విరిగిపోయింది.

అర్థరహితమైన వారి కోపానికి, మనసు దహించుకపోయింది.


తమ ఇద్దరిమధ్య నున్న బాంధవ్యపు తెగలు చాలావరకు సాగాయని తనకు తెలుసు. అవి తెగిపోకుండా ఉండాలని చాలావరకూ ప్రయత్నించింది. కానీ, సాగినతీగలు తెగకుండాఎన్నాళ్లుంటాయి. తెగిపోవడంకూడా మంచిదేనేమో అనిపించకపోలేదు తనకు.

విరక్తితో విరిగిపోయిన తన హృదయము, రాబోయే విషమ పరిస్థితులను ఎదుర్కొనేందుకు సంసిద్ధంగానే ఉంది.

'హుఁ...పిల్లలకోసం ఉరెట్టుకునేటంతటి ప్రేమ మీకు వాళ్ళమీద ఉంటే వాళ్ళలా జీవచ్ఛవాల్లాగా ఎందుకు తయారయ్యేవాళ్లు?' అంది విచలిత, విరక్త కంఠంతో.

'నాకులేదు; పోనీ నీ కుంటే...' క్రూరంగా తనవేపు చూస్తూ కఠినంగా వ్యంగ్యంగా అన్నారు.

'నే నంతటి పిరికిదాన్ని కాదు. అంత బాధ్యతారహితంగా గూడా ప్రవర్తించను. పిల్లల్ని కనటంతోటే సరిపోదు; వాళ్ళ కింత కూడూగుడ్డా ఇవ్వవలసిన బాధ్యత మన మీదే ఉంది,




ఆ బాధ్యతను మీరు మరచిపోయారు. నేనూ విస్మరిస్తే...' ఆగింది.

ఆయన పరిహాసంగా నవ్వారు.

'ఇంతవరకూ వచ్చింది గనుక ఇక చెప్పక తప్పదు. పిల్లల్ని తీసుకుని పుట్టింటికి వెళ్లాలనుకుంటున్నాను;' ఆయన ముఖంలోని ప్రతి కదలికనూ పరిశీలనగా చూస్తూ అంది.

'సంతోషంగా!' అదోరకంగా నవ్వుతూ అన్నారు.

తన హృదయంలో ఏ మూలో నిద్రిస్తున్న అభిమానం బుస్సున పొంగింది.

కన్నుల్లో చివ్వున నీళ్ళు తిరిగాయి. తన కన్నీటిని వారికంట పడనీయరాదన్న ఉద్దేశంతో ముఖం తిప్పుకుని –

'యేం, వెళ్ళిపోవడం అంత సంతోషకరమైన విషయమైతే, ప్రొద్దుటే వెళ్తాము' అని, అక్కడనుండి వచ్చేసింది.

'శని వొదిలిపోతుంది,' అన్నమాటలు తన వెనకే వచ్చి, వాడియైన బాణాల్లా హృదయాన్ని దూసుకపోయాయి.

ఒకప్పుడు జీవితానికి జ్యోతీ, వెన్నెలా, అదృష్టదేవతా అయిన తను ఆరోజుకు శనిగ్రహంగా మారింది!

అంతకంటే మనసుకు చిత్రహింస మరొకటేం కావాలి?

సతీష్, పాపా నిద్రలోనే ఊరకే కదలుతున్నారు,

బహుశా ఆకలికేమో?

బాబు ప్రక్కలో కూర్చుని, మనసును ప్రశాంత పరచుకొనేందుకు ప్రయత్నించింది.

బయట వ్యాపించి ఉన్న తమస్సు లాగే ఉంది తన హృదయం.

అభిమానం రక్షణకోసం పుట్టింటికి వెళ్తానని చెప్పడమైతే చెప్పిందిగానీ — ఏ ముఖం పెట్టుకుని వెళ్ళడం?

వెళ్ళినా, అక్కడ ఎన్నాళ్ళుండ గలదు?

మావయ్య దగ్గరకు వెళ్తేమటుకు ఆయన ఎన్నాళ్ళ పెట్టగలరు? అందులో ఉద్యోగంనుండి రిటైర్ అయ్యారు గూడా, ఒకనెలా రెండునెలలూకాదు — ఎన్నాళ్ళు ఒకరిమీద ఆధారపడి ఉండాలో తెలియదు. భవిష్యత్తంతా అగమ్యం, అనిశ్చయం, అంధకారం.

వారు మారుతారో లేదో తెలియదు. ఒకవేళ మారినా, ఎప్పటికో?

చీకటి తెరలతో కప్పబడిన తన జీవితానికి ఒకే ఒక వెలుగు రేఖా, ఆశాకిరణమూ కనిపించింది.

అదే తనకున్న డిగ్రీ.

ఆ డిగ్రీతో తను పిల్లలను క్షుధాగ్ని కీలలనుండి రక్షించగలదు.

తన సంసారజీవితం ఏనాడో భగ్నమైంది. ఇన్నాళ్ళుగా తనెంతో జాగ్రత్తగా తెరలుకప్పి కాపాడుతూ వచ్చిన తన సంసారపుగుట్టు తను వెళ్ళిపోగానే బహిరంగం కాకతప్పదు. అయినా, తప్పదు, వెళ్ళవలసిందే.

ఎన్నాళ్ళని మిథ్యా గౌరవాలకు మానవత్వపు విలువలను బలిఇవ్వగలదు? అందుకు తనలోని మానవతా, మాతృత్వమూ ఎలా సహించగలవు? సంసారపు గుట్టు కాపాడాలని పిల్లల జీవితాలను బలిగా ఇవ్వగలదా? వారు ఆ విషయాలనన్నింటినీ ఆలోచించే స్థితిలో లేరు; కానీ, తను?

వారితో చెప్పినట్లే ఆమర్నాడు ఉదయం వచ్చేసింది.

వారు మేలుకుని ఉండే, నిద్ర నటించారు. కొన్నిసంవత్సరాల బంధనాలను తెంపుకుని వస్తుంటే... 'ఓ భగవాన్! నరక సదృశం లాంటి ఆ బాధ పగవారికికూడా వద్దు.'

విషయం తెలుసుకున్నాక అమ్మా నాన్నా ఎంతగానో దుఃఖించారు.

తను తొందరపడినట్లూ, పొరపాటు చేసినట్లూ మాట్లాడింది అమ్మ.

కానీ, నాన్న మటుకు కావలసిన ధైర్యాన్నీ, చేయూతనూ ఇచ్చారు.

భగవంతుని దయవల్ల నెలరోజులకే ఇక్కడ ఈ వుద్యోగం దొరికింది.

అమ్మ తనతో వచ్చివుంటానంది. కానీ, తనే వద్దంది. తన సంసారాన్ని సవరిస్తూంటే, ఆమె సంసారము ఏం కావాలి?

అందుకనే అమ్మ ఎంతగానో

ప్రాధేయపడినా, తను ససేమిరా కాదంది. తను ఉద్యోగంలో చేరి అప్పుడే ఆరునెలలకుపైగా అవుతూంది. నాన్నమటుకు అప్పుడప్పుడూ వచ్చి చూచివెళ్తున్నారు. ఈ ఆరునెలల్లో వారికి ఒక్క ఉత్తరమూ వ్రాయలేదు.

హృదయాంతరంలో గుప్తంగా దాగి ఉన్న అనురాగబంధాలు అప్పుడప్పుడూ తనచేత ఉత్తరం వ్రాయించేందుకు కలం పట్టించినా, అభిమానం అడ్డుపడి, ఆ ప్రయత్నాన్ని విరమింపజేసేది.

మొన్నమటుకు బాబు పరిస్థితి తెలియజేస్తూ ఉత్తరం వ్రాయక తప్పలేదు. నెలరోజుల క్రిందట గాబోలు, నాన్న కో ఉత్తర్మ వ్రాసారట—పిల్లల క్షేమ సమాచారాలు తెలియజేయవలసిం దని. నాన్న జవాబు ఇవ్వలేదట. కనీసం తా నక్కడ లేననిగూడా తెలియజేయ లేదట; ఆవిషయం నాన్న చెప్పినప్పుడు నాన్న కఠినత్వానికి బాధపడకపోలేదు. కానీ, పైకి ఏమీ అనలేకపోయింది. మావయ్య వ్రాసిన ఉత్తరానికి మటుకు జవా బిచ్చారట. తను ఫలానచోట ఉందన్న వియషయం తెలుసుకున్న మావయ్య ఓపెద్ద ఉత్తరం వ్రాస్తూ, వీలు చూసుకుని తను వ్రాస్తున్నట్లూ, మాట్లాడవలసిన విషయాలు చాలా ఉన్నట్లూ వ్రాశారు. కానీ, ఇంతవరకూ రాలేదు...

ఇంతలో బాబు అమ్మ, అమ్మ, అనడంతో సరోజ ఆలోచనలు తక్కున ఆగిపోయాయి.

బాబుదగ్గరకు వెళ్ళి, నుదుట్న చెయ్యి వేసి పలకరించింది.

డాక్టరు కళ్ళు గర్వంగా మెరిశాయి.

"ఇక భయపడవలసిన అవసరం లేదు. ఇంకో ఐదు నిముషా లయ్యాక అవసరమైతే మరో ఇన్‌జెక్షన్ ఇచ్చి వెళ్తాను" అన్నాడు బాబు ముఖంలోకి పరీక్షగా చూస్తూ. తల్లి మృదువైన కర స్పర్శ నుదురుమీద తగలగానే, తను సురక్షితంగా ఉన్నాననేమో కళ్ళు మూసుక పడుకున్నాడు. బాబు ముఖంలో నుండి చూపులు మరల్చిన సరోజ చూపులు అనుకోనిరీతిగా భర్తచూపులతో కలిశాయి.

వెంటనే కళ్ళు వాల్చింది సరోజ. రామారావు మటుకు భార్య ముఖంలోకి పరిశీలనగా చూడసాగాడు.

ఒకప్పుడు ఇంటిలో వెలుగు అని మురిసిపోయిన సరోజ ముఖంలో ఈ రోజు ఒక్క వెలుగురేఖా కనిపించలేదు.

ఆ తలపుతో బరువుగా నిట్టూర్చాడు. ఆలోచనలు తిరిగి గతాన్ని తవ్వుతూ వెళ్ళాయి.

బరువుబాధ్యతలను మోయవలసిన తను వాటినుండి వైదొలగి దూరంగా పోయాడు. అసలు బెంగళూరు ట్రాన్స్‌ఫర్ కావడమేదురదృష్టకరమైనవిషయం. ఉహూ... అలా ఎందు కనుకోవాలి?

బెంగుళూరు లాంటి పట్టణాలలో ఎంతమంది తమ సంసారాలతో సుఖ జీవనం చేయడం లేదు? క్లబ్బులకు మటుకు ఎంతమంది పోవడం లేదు? ఎంతమంది పేకాడడం లేదు? అందరూ తనలాగే కర్తవ్యదూరులై మధురమైన సంసార జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారా? లేదే?

సరదాకని ప్రారంభించిన పేకాట తనను కర్తవ్యవిముఖుణ్ని చేస్తుందనీ, ఇంతటి విషాద పరిస్థితులకు దారి తీస్తుందనీ తనకు మటుకేం తెలుసు? బహుశా ముందే ఆ విషయం తెలిస్తే... ఆ ఆట జోలికి అసలు వెళ్ళేవాడే కాదు. మొదటి రోజు పోగొట్టుకున్న పది రూపాయలను తిరిగి రాబట్టుకోవాలన్న పట్టుదలే ఇంతటి వినాశానికి దారి తీసింది. కానీ, జరిగింది మటుకు చేతినుండి పోగొట్టుకోవడమే.

డబ్బు పోతున్నకొద్దీ తనలో పట్టుదలా పెరిగింది. వందలూ వేలూ నీళ్ళలా తెప్పించాడు. వచ్చేజీతం రెండురోజులకు చాలేవి కాదు.

చట్టూ అప్పులు పెరిగిపోయాయి. ఈరోజు కాకుంటే మరునాడు తన డబ్బు వడ్డీతో సహా రాకపోతుందా అన్న ఆశ.

ఆ ఆశే తన జీవితాన్ని సర్వనాశనం చేసింది.

ఒకటికాదు, రెండుకాదు, సంవత్సరాలు ఆ అంధకారంలోనే మ్రగ్గిపోయాడు. ఒకరోజు సరోజ కంట్లో ఒక కన్నీటిబొట్టు రాలితేనే సహించలేని తన మనసు ఆ మూడు సంవత్సరాలలో ఆమె కన్నీటి వరదలను చూసికూడా సహించగలిగింది. ఆ అంధకారంనుండి పశుత్వంనుండి తనను వెలుగులోకి తెచ్చేందుకు సరోజ ఎంత ప్రయత్నించింది? ప్చ్! ఏం ప్రయోజనం? తనేదో పెన్నిధిని సంపాదించపోతూంటే సరోజ తన మార్గానికి అడ్డు పడుతున్నట్లనిపించి, ఎక్కడలేని కోపమూ, చిరాకూ కలిగేవి. తన సంతోషాన్నంతా నాశనం చేస్తున్నట్లు అపార్థం చేసుకొనేవాడు. నోటికొచ్చినట్లల్లా తిట్టేవాడు.


సభ్యతా, సంస్కారమూ గల తనలాంటివాళ్లు ఉచ్చరించవలసిన తిట్లు కావవి. పాపం, సరోజ అవన్నీ ఎలా భరించగలిగిందో?

తనను నిజంగా ఏదో పిశాచం పట్టి పీడించసాగింది; లేకుంటే తన ప్రవర్తన కర్థం?

సరోజ ఇంటినుండి వెళ్ళిపోగానే, తనను పట్టి పీడిస్తున్న పిశాచం మరింత వుధృతంగా చెలరేగింది,

ఆ రోజు సాయంత్రం త నేం చేస్తున్నాడో తనకే తెలీదు.

ఆఫీసు డబ్బు వెయ్యి రూపాయిలు తీసుకుని క్లబ్బుకు పరుగులు తీశాడు ఆ వెయ్యితో పోగొట్టుకున్న డబ్బంత రాబట్టుకోవా లనుకున్నాడు.




కానీ, పేకాడి బాగుపడిం దెవరు ? తను మటుకు ఎలా బాగుపడుతాడు ? పదిమంది సర్వనాశన మైతేగానీ, ఒకడు బాగుపడడు.

ఎప్పటిలాగే ఆరోజూ డబ్బు పోగొట్టుకున్నాడు.

ఆ మర్నాడే ఆఫీసు డబ్బు కట్టాలి. అంతా సర్వనాశన మైం దనుకున్నాడు. కానీ, ఆ నిరాశలోనే ఒక ఆశాకిరణం.

నాన్న ఆదుకునితీరుతా రన్న భావం.

ఆ రాత్రే బయలుదేరి వెళ్లాడు. విషయము తెలుసుకున్నాక బాధతో విలవిల లాడుతున్న ఆయన ముఖంలోకి చూడ లేకపోయాడు.

తల వాచేటట్లు చీవాట్లు వేస్తారని అనుకుంటున్న తనకు నిరాశే ఎదురైంది.

"నువ్వింత అవివేకుడ వనుకోలేదు. చేజిక్కిన రత్నాన్ని పోగొట్టుకున్నావు." అన్నారు. అంతే ! కొరడాతో కొట్టినట్లనిపించింది.

ఇంక వేరే చివాట్లుమటు కెందుకు ?

నాన్న వెయ్యిరూపాయలు తెచ్చివ్వబట్టి ఉద్యోగం దక్కింది.

పేకాట ఆడనని నాన్నదగ్గర ప్రమాణం చేసి మరీ వచ్చాడు.

కానీ, బలహీనమైన తన మనసు పేకాటవేపు మొగ్గు చూపేది. అతి ప్రయత్నంమీద ఆ కోరికను అణచుకొనేవాడు.

ఒకరోజు క్లబ్బువరకు వెళ్ళడం గూడా జరిగింది ? ఎలాగో తమాయించుకుని తిరిగివచ్చాడు.

మొన్న సరోజదగ్గరనుండి ఉత్తరం

రాగానే ఇక తనను తాను సంబాళించుకో లేకపోయాడు.

ఒకవేళ బాబు మరణించే ఉంటే... అలా జరగకుండుగాక!...సరోజ తనను జీవితంలో క్షమించగలిగేదా?

భగవానుని దయవల్ల బాబు కోలుకున్నాడు, అంతేచాలు.

అంతలో బాబు కదలి, కళ్లు తెరచి తండ్రి ముఖంలోకి వింతగా చూడసాగాడు.

రామారావు ఆలోచనలు తక్కున ఆగిపోయాయి. డాక్టరు ముఖంలో సంతృప్తిరేఖలు కదిలాయి.

"మరో ఇన్‌జెక్షన్ అవసరం లేదనుకుంటాను. రేపు తిరిగి వస్తాను. ఈ మందు క్రమంగా వాడండి," అని చెప్పి వెళ్ళిపోయాడు.

సరోజ బాబు నుదురుమీద చెయ్యివేసి వాడిముఖంలోకి చూస్తూకూర్చుంది.

నిముషాలు దొర్లిపోతున్నాయి, కానీ, భార్యా భర్త లిద్దరిమధ్యా నలిగిపోతున్న నిశ్శబ్దాన్ని ఇద్దర్లో ఏ ఒక్కరూ భేదించలేదు.

సరోజ తన ఆలోచనలలో తను తేలిపోసాగింది.

గతం తాలూకు బాధాకరమైన స్మృతులు ఆమె హృదయాన్ని కదిల్చివేసాయి. దాంతో కళ్ళల్లోనుండి నీటిబొట్లు జలజలా రాలాయి.

రామారావు విచలిత స్వరంలో-

"సరూ, నన్ను క్షమించాలనిపిస్తే క్షమించు; కానీ, ఏడవకు. నీ కంటినుండి జారిన ప్రతికన్నీటిబొట్టు గతంలోని నా క్రూరత్వాన్నీ, రాక్షసత్వాన్నీ గుర్తుకు తెస్తున్నాయి. వికలమైపోయిన నా మనసు అది భరించే స్థితిలోలేదు." అంటూ తన ముఖాన్ని దోసిట్లో దాచుకున్నాడు.

సరోజ చెంపలమీద జారిన కన్నీటిని తుడుచుకుని, తడికళ్ళతో భర్త వేపు చూసింది.

అంతవరకూ అభిమానపు తెరల మాటున దాగిఉన్న అనురాగం, ఆ తెరలను తొలగించుకుని ముందు కొచ్చింది, ఇక దాన్ని గుప్తంగా దాచలేకపోయింది.

"జరిగింది జరిగిపోయింది. బాధపడకండి!" అంది సరోజ, భర్త ముఖాన్ని కప్పిఉన్న చేతులను తొలగిస్తూ, తప్త కంఠంతో.

దుఃఖ సంతోషాలతో మిశ్రితమైన ఆమె హృదయం ఎన్నో చెప్పాలనీ, అడగాలనీ తహతహలాడింది. కాని, ఏమీ అడగలేకాపోయింది, చెప్పలేకనూ పోయింది.

"సరూ, నన్ను విశ్వసిస్తానంటే ఒక్కమాట చెప్తాను." ఆమె కన్నుల్లోకి చూస్తూ అన్నాడు.

"చెప్పండి!"

"ఈ అజ్ఞాతవాసం ఇక నీకు వద్దు. ఇలాంటి పొరపాటు తిరిగి జరగనివ్వనని



ప్రమాణపూర్వకంగా చెప్తున్నాను."

అతని కన్నులలో ప్రార్థనా, ఆశా_ఆమె కన్నుల్లో సంశయం, నిరాశా; హృదయం మటుకు ఆనందంతో గంతులువేసింది.

భగవంతునికి శతకోటి జోహారు లర్పించింది.

కానీ, మెదడు లక్షలకొలదీ సంశయాలను వెల్లడించి ఆ ఆనందాన్ని నాశనం చేసింది. ముఖప్రీతిమాటలు మగవాళ్ళు ఎన్నయినా చెప్తారు. అందునా, వ్యసనలంపటులైనవారి మాటలు నమ్ముకొని ఎలా వెళ్ళడం?

వాళ్ళలో వివేకం, విచక్షణా, మానవతా అన్నీ సుషుప్త్యావస్థలో ఉంటాయి.

ఎప్పుడో మేలుకొన్నప్పుడు బాధపడతారు. పొరపాటు చేస్తున్నట్లు తెలుసుకుంటారు. ప్రమాణాలు చేస్తారు. కానీ, అవన్నీ క్షణికం. మరుక్షణం కాకున్నా మరోరోజుకు యథాస్థితికి వస్తారు.

అలాంటివారి మాటలు నమ్ముకుని ఉన్న ఉద్యోగం ఒదులుకుని వెళ్ళి తిరిగి నలుగురిలో నవ్వులపాలు కావటంతప్ప మరేం లాభముంది?

"సందేహిస్తున్నావా, సరూ? కానీ సందేహాలూ, భయాలూ నిజం కావు. నన్ను నేను పరీక్షించుకుని విజయం పొందాకే నిన్ను రమ్మంటున్నాను. ఆ వ్యసనంనుండి నన్ను నేను తప్పించుకోడాని కెంత ఆత్మనిగ్రహం కావలసి వచ్చేదో అది నాకు తెలుసు. నువ్వు ఊహించలేవుకూడా. జరిగిన పొరపాటు ఇక జరగదు. స్వచ్ఛంగా, మనోహరంగా ఉన్న మన సంసారాన్ని కారుమేఘాలు క్రమ్మివేశాయి. మనం ఊహించని, ఎదురుచూడని చీకటి మన జీవితాలను ఆవరించింది. కానీ, మేఘాలు కలకాలం కాపురం చేయవుగా, సరూ? ఆ కారుమేఘాలన్నీ ఈరోజుతో పూర్తిగ వర్షించాయి. నువ్వు క్షమించగలిగితే తిరిగి మన జీవితాలూ, సంసారం సుందరంగా ఆనందంగా మారగలదు. ఏమంటావు సరూ?"

ద్వైదీభావమానస యైన సరోజ తక్షణమే ఎలాంటి జవాబూ ఇవ్వలేక పోయింది. భర్త ముఖంలోకి ఓరగా, పరిశీలనగా చూసింది.

"నమ్మలేకున్నావు గదూ? సరే, బాబుమీద ప్రమాణం చేసి చెప్తున్నాను," అని అంటుంటే రామారావు కంఠం సన్నగా వొణికింది.

"వొద్దు... వొద్దు... నమ్ముతాను;" ఆత్రంగా భర్తచేతిని తన రెండుచేతుల్లోకి తీసుకుంటూ అంది. ఆనందాశ్రువులు చెంపలమీదుగా జారాయి.

బాబుకు కాస్త నయం కాగానే వెళ్దామా?" కన్నీటిని తుడుస్తూ అడిగాడు

"అలాగే; ఈరోజుకొరకే ఇన్నాళ్లు వేయికన్నులతో నిరీక్షించాను."

మృదువుగా, మెల్లగా అంటూ, భర్త గుండెలమీద తల వాల్చుకుంది సరోజ